# పిల్లల సహకారం
(కథ)

రాము తరగతిలో పెన్నును పోగొట్టుకున్నాడు. ఆ పెన్ను గురించి అతడు అందరినీ అడిగాడు. ఎవరూ తాము ఆ పెన్నును తీయలేదని చెప్పారు. సురేష్ దగ్గర తన పెన్ను ఉండటం చూసిన రాము మాస్టారుకు సురేష్ పై ఫిర్యాదు చేశాడు .

మాస్టారు సురేష్ ను ఒంటరిగా పిలిపించి రాము పెన్నును ఎందుకు తీశావని ప్రశ్నించాడు? సురేష్ తాను అతని పెన్నును తీయలేదని, నిన్ననే తాను ఈ కొత్త పెన్నును కొన్నానని అన్నాడు. కావాలంటే తన మిత్రుడు వేణుకు ఈ సంగతి తెలుసని అన్నాడు .

మాస్టారు వేణును పిలిపించి అడిగారు. అతడు సురేష్ చెప్పింది నిజమేనన్నాడు. మాస్టారు తలపట్టుకున్నాడు. "తరగతిలో రాము పెన్నును ఎవరు తీసినట్లు?" అని మాస్టారు ఆలోచించాడు .సురేష్ పైననే మాస్టారుకు అనుమానం కలిగింది. వెంటనే సురేష్ కు అత్యంత సన్నిహితుడైన గోపి అను మరొక విద్యార్థిని పిలిచి "రాము పెన్నును సురేష్ తీశాడా" అని మాస్టారు గోపిని ప్రశ్నించాడు? అప్పుడు గోపి తాను చూడలేదని చెప్పాడు. "మరి ఆ పెన్ను ఏమైనట్టు?" అని ఆలోచించిన మాస్టారు " సురేష్ చేతిలో ఉన్నది రాము పెన్ను కాదా !" అని మాస్టారు గోపిని తిరిగి ప్రశ్నించాడు.

గోపి " మాస్టారూ! ఆ పెన్ను రామూదా ! కాదా! ఇప్పుడే నేను మీకు చెబుతాను. మన విద్యార్థులు ఎవరైనా తమ పెన్ను లోపల చివర ఒక చీటీపై వారి పేర్లు వ్రాసి ఆ రిఫిల్ చివర చుట్టుతారు .నాకు ఆ సంగతి తెలుసు.నేను ఇప్పుడే వస్తాను ఉండండి " అని అక్కడి నుండి వెళ్లాడు. తర్వాత అతడు సురేష్ వద్దకు వెళ్లి అతని పెన్నును అడిగి తీసుకొని మళ్ళీ ఇస్తానని అతనికి తెలియకుండా మాస్టారు వద్దకు దానిని తీసుకొని వచ్చాడు. ఆ రిఫిల్ ను అందులో నుండి తీశాడు .దానికి చుట్టిన కాగితంపై 'సురేష్ 'అని వ్రాసి ఉంది .దాంతో మాస్టారుకు సురేష్ పై ఉన్న అనుమానం తొలగిపోయింది.

ఇంతలో రాము వచ్చి "మాస్టారూ! నా పెన్ను దొరికింది. నేను నిన్న శేషుకు దాన్ని వ్రాసుకోవడానికి ఇచ్చి మరచిపోయాను .అతడు నిన్న బడికి రాలేదు. ఇప్పుడే అతడు నాకు దానిని తెచ్చి ఇచ్చాడు " అని చెప్పాడు . "అమ్మయ్యా! వీడి మతిమరుపే ఇంత గొడవ తెచ్చి పెట్టింది .పిల్లల సహకారం లేకపోతే ఈ సమస్య నాకు జటిలం అయ్యేది" అని అనుకున్నాడు మాస్టారు. అందుకే మతిమరపు పనికి రాదు.



-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

పుస్తక సమీక్ష

# క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్




బహుముఖ ప్రజ్ఞాశాలి.. రాష్ట్రపతి అవార్డు గ్రహీత, బహుగ్రంథకర్త, కాలమిస్టు.. కవి, రచయిత, కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్. డిగ్రీ కళాశాల పూర్వ ప్రధానాచార్యులు, ఎన్.సి.సి.. కమాండర్, లయన్ డా॥ బుర్ర మధుసూదన్‌రెడ్డిగారు క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్' (జాతీయ అంతర్జాతీయ) వేడుకలను రేఖామాత్రంగా పరిచయం చేస్తూ ఓ బృహత్ గ్రంథాన్ని వెలువరించారు. "మధుపాళీ" కవితా సంపుటితో కవిగా సాహితీలోకంలో తమకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని పదిల పరుచుకున్న డా॥ రెడ్డిగారు ఈ రోజు అనేక ప్రముఖ పత్రికలకు కాలమ్స్ రాస్తూ ఓ విశ్లేషకునిగా, వ్యాసకర్తగా, అందరికీ నిత్యం దర్శనమిస్తున్నారు. డిగ్రీ, పీజీ అధ్యాపకునిగా రసాయన శాస్త్రమందు విశేష ప్రతిభా పాటవాలను ప్రదర్శించిన అనుభవం ఆయనకు ఉంది. అంతేగాక ఎన్.సి.సి & ఎన్.ఎస్.ఎస్. కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి సామాజిక సేవలో తరించిన ఆయన.,. సదా సమాజ జాగృతికి పాటుపడా లన్న ఆకాంక్ష, అభిరుచి ఆయనకు ఉండటం అభినందనీయం.

ప్రస్తుతం వెలువరించిన "క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్స్" గ్రంథంలో.. జనవరి ఒకటో తేదీ నుండి 31 డిసెంబర్ వరకు ప్రతి ఏటా విశ్వవ్యాప్తంగా జరుపుకునే దాదాపు 225 వరకు దినోత్సవాలను ప్రముఖుల జయంతులను, వర్ధంతులను పొందుపరిచారు. నేడు శాస్త్ర సాంకేతిక విజ్ఞానం విస్ఫోటన స్థాయిలో విస్తరిస్తున్న నేపథ్యంలో.. మార్పు నిరంతర ప్రక్రియ అనీ..కాలానికి ఆరంభ అంతాలు లేవనీ.. ఇదొక నిరంతర జీవధార అని భావించే రచయిత డా॥ రెడ్డిగారు ఈనాటి పోటీ ప్రపంచంలో రాణించడానికి మనకంటూ కొన్ని విలక్షణతలు ఉండాలని భావించి.. అనేక విజ్ఞానదాయక అంశాలను ఈ గ్రంథంలో నిక్షిప్తం చేశారు. కాలానికి అనుగుణంగా విజ్ఞానం పెరిగే క్రమంలో.. సమకాలీన సమస్యలు.. వార్తలు, జనరల్ నాలెడ్జ్, ప్రపంచ పోకడలు– ఈతరం వారిలో పెంపొందించాలన్న తపనతో డా॥ రెడ్డిగారు ఈ గ్రంథం ద్వారా అనేక విజ్ఞానదాయక అంశాలను అందించయత్నంచాడం బహుదా ప్రశంసనీయం.

ఈ గ్రంథం వ్యక్తిత్వ వికాసానికి, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అలవర్చుకోవడానికి.. కొంత మేరకైనా ఉపయుక్తంగా ఉండటానికి డా॥ రెడ్డిగారు కృషి చేయడం స్వాగతించదగింది. ప్రతీ మాసంలో వచ్చే జాతీయ, అంతర్జాతీయ వేడుకలకు సంబంధించిన రేఖామాత్ర సమాచారాన్ని పొందుపరిచి.. గ్రంథానికి శోభను కూర్చారు.



సంతోష కుటుంబాలే విశ్వ కళ్యాణ వేదికలంటూ.. జనవరి ఒకటో తేదీన జరిపే "గ్లోబల్ ఫ్యామిలీ డే' సందర్భంగా రాసిన వ్యాసంలో వసుధైక కుటుంబ భావనను జీర్ణించుకుందామంటూ పిలుపునిచ్చారు. జనవరి నాలుగో తేదీన 'బ్రెయిలీ దినం' సందర్భంగా రాసిన వ్యాసంలో లూయిస్ బ్రెయిలీ జీవిత విశేషాలను చర్చించారు. జనవరి పదో తేదీన జరుపుకునే ప్రపంచ హిందీ దినోత్సవం సందర్భంగా రాసిన వ్యాసంలో.. జాతీయ సమైక్యతకు పునాది జాతీయ హిందీ భాష అని నొక్కి చెప్పారు.

సహనశీలి, నిరాడంబరుడు, నిస్వార్థ సేవా తత్పరుడైన మన పూర్వ ప్రధాని వినయశీలి లాల్ బహదూర్ శాస్త్రి గారి వర్ధంతి జనవరి 11వ తేదీన రాసిన వ్యాసంలో శాస్త్రిగారిని ఉన్నతంగా ఆవిష్కరించి అక్షరాంజలి ఘటించారు. "భారత ఆర్మీదినం" జనవరి 15 సందర్భంగా రాసిన వ్యాసంలో "అభేద్యం భారత వీరసైన్యం" అంటూ కొనియాడారు. జనవరి 23 నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతి సందర్భంగా రాసిన వ్యాసంలో "జైహింద్‌ను శ్వాసించిన నేతాజీ" అని శ్లాఘించారు. జనవరి 24న 'జాతీయ బాలికల దినోత్సం' సందర్భంగా రాసిన వ్యాసంలో ఆడబిడ్డలో అమ్మను చూసుకుందామని పిలుపునిచ్చారు. జనవరి 25న జరుపుకునే పర్యాటక దినోత్సవ సందర్భంగా రాసిన వ్యాసంలో పర్యాటకంతోనే దేశ సుస్థిర ప్రగతి అని అభిప్రాయపడ్డారు. జనవరి 25ననే జరుపుకునే 'జాతీయ ఓటరు దినం' సందర్భంగా రాసిన వ్యాసంలో ఓటరును చైతన్యవంతం చేసిన తీరు బాగుంది. జనవరి 26న ప్రతి ఏటా జరుపుకునే గణతంత్ర వేడుకలను చర్చిస్తూ మరో వ్యాసానికి ఇందులో చోటు కల్పించారు. జనవరి 28న జరుపుకునే "లాలా లజపతి రాయ్ జయంతి"ని వివరిస్తూ మరో వ్యాసాన్ని రూపుదిద్దారు. ఇంకా జనవరి మాసంలో జరుపుకునే వీధి బాలలదినం, మెహర్‌బాబా వర్ధంతి, కుష్టు నిర్మూలనాదినం తదితర వ్యాసాలను ఇందులో పొందుపరిచారు.

సం॥ము పొడుగునా ఇలా ప్రతీ మాసంలో జరిగే జయంతులు-వర్ధంతులు.. ఇతర ఈవెంట్స్‌ను ఓ క్రమంలో విశ్లేషిస్తూ.. ఈ గ్రంథంలో నిక్షిప్తం చేశారు. ఒక్కో ఈవెంట్‌ను విశ్లేషిస్తూ.. సమకాలీన పరిస్థితులకు అన్వయిస్తూ రాసిన వ్యాసాల్లో రచయిత డా॥ రెడ్డిగారి అధ్యయనశీలతను.. పరిశోధనాత్మక దృక్పథాన్ని సామాజిక చింతనను చూడగలం.. జాతీయ, అంతర్జాతీయ వేడుకలను వివరిస్తూ రాసిన ఈ ఉద్గ్రంథం ప్రతీ గ్రంథాలయంలో ఉండదగింది. ప్రతి పాఠశాలలో పిల్లలకు అందుబాటులో ఉంచడానికి యోగ్యతగల గ్రంథమిది. ఎంతో శ్రమకోర్చి.. సమాచారాన్ని సేకరించి.. ఓ క్రమంలో ఏర్చి కూర్చి ఈ గ్రంథాన్ని పాఠక లోకానికి అందించిన రచయిత డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డిగారిని అభినందిద్దాం.. ఈ గ్రంథంలో వ్యాసాలతో పాటు.. అక్కడక్కడ కొన్ని కవితలకు చోటు కల్పించారు. దాదాపు వ్యాసాలు– కవితలు వివిధ పత్రికల్లో లోగడ ప్రచురితమైనవే కావడం విశేషం.

ఈ గ్రంథం వెలుగులోకి రావడానికి రెడ్డిగారికి అన్ని విధాలా సహకరించిన శ్రీ ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత శ్రీ వి. నరేందర్ రెడ్డిగారికి అభినందనలు తెలియజేద్దాం.. డా॥ బుర్ర మధుసూదన్‌రెడ్డిగారి మధుపాళీ నుండి మరిన్ని సమాజహిత రచనలు ముమ్ముందు మరిన్ని రావాలని కోరుకుందాం..

**ప్రతులకు:** శ్రీమతి జలజారెడ్డి
ఇ.నెం. 2-10-1400/సి, మైత్రీ టవర్స్
జ్యోతినగర్,
కరీంనగర్-505 001
సెల్: 994970037



– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

# పాపం యువత

అప్పుడప్పుడే జీవితంలో
అడుగుపెట్టే తరుణంలో
తప్పో ఒప్పో తేల్చుకోలేని సందిగ్ధంలో
కొత్త రుచులు చూడాలనే
తహతహలో
స్నేహితుల మధ్య తక్కువ
కారాదను బలహీనతను ఆసరాగా
మలచుకొని జీవితాలు ఛిద్రం చేయుట
న్యాయమా ధూమపానం మా?

గుప్ గుప్ మంటూ మేఘమల్లే
కనులముందు నిలిచి ..
మనసును మత్తెక్కించి ..తేరుకొనేలోపు
కారుమబ్బై కమ్ముకుంటున్నావ్
కాటికి పంపి వికట్టాట్టహాసం చేస్తావ్!

మిత్రుల ముందు హీరో అవ్వాలనే
బలమైన కాంక్ష తో నీలో బంధింపబడి
..
బయటపడలేక నిస్సాహాయతతో
అడుగులు తడబడి జీరోగా నిలబడి
తన వారిని నట్టేట ముంచుతున్నాడు.

క్షణమాలోచించుకో యువత!
నువ్వెప్పుడూ నాయకుడివే
కార్యదక్షత,పట్టుదల, సునిశిత
ఆలోచన నీ ఆయుధాలైనప్పుడు
క్షణికానందాలకు ప్రాముఖ్యత ఇచ్చి
బలిచేసుకోకు బ్రతుకును
బూడిదై మిగిలి
కడుపుకోత మిగల్చకు
నీ జననిజనకులకు



-సి. హేమలత
9666779103

# మనిషెక్కడ?

మానవత్వమేనాడో
మనుషులచేతుల్లో తునాతునకలైపోయింది
మనిషి మనిషిలా చూడలేని
సమాజంలో
కనిపించనివాటికై లక్ష్మణరేఖలుగీసుకుని
అహంకారాన్ని రంగరించి
రంగుల్నద్దుకున్న లోకాన
నిత్యసంఘర్షణలతో దద్దరిల్లుతుంది
తరాలెనెన్నో మారినా
నాగరికతకంతా పాతవాసనే
జాతులుగా విడిపోవడం
బలహీనులనంతా అణిచివేయడం
దోచుకునేతత్వంతో సాకులెతుకుతూ
భూతద్దాల్నెట్టి రాద్ధాంతంచేస్తూ
వేదాంతం వల్లించడమే నైజం
మనిషికెవడివాడే గొప్పోడు
కనిపించనోళ్ళనడ్డెట్టుకుని
జీవితాలతో చెలగాటం
కుళ్ళిన ఆలోచనల్లో
నిశినిండిన మనసులో
కసిగా రక్తపుటేరులు పారిస్తూ
సాటివాడిలో తప్పులెతుకుతున్న
నేటి నాటుమనిషి
అడుగులన్నీ వెనకవైపుకేనాయే
సాటివాళ్ళను గౌరవించని
నవనాగరికత వారసుడు



-సి. శేఖర్(సియస్సార్)
9010480557

# మేము మార్చగలం

మేము అనుకుంటే
అమావాస్యను
పున్నమిలా మార్చగలం
అంధకారంలో
వెలుగును నింపగలం
భగభగ మండే అగ్నిశిఖను
చల్లని మంచుతో కప్పగలం
మేము తలచుకుంటే
డాక్టర్లు కాగలము
ఇంజనీర్లు కాగలము
ఒక సైంటిస్టు అవ్వగలం
చిక్కుముళ్ళలో పడున్న ప్రజలకు
బంగారు బాట చూపగలం
కులమతాల కోసం
కొట్లడుతున్న మనుషులకు
వెలుగు పథాన్ని సృష్టించగలం
కొండలను పిండి చేసే వీరులం మేము
యుద్ధాన్ని గెలిచె యోధులం మేము
ఓ సమాజమా!
మేము తోటలో అప్పుడే
వికసించిన విరులం
మేము చరిత్రను సృష్టించగలం
అదే చరిత్రను మార్చితీర్చిదిద్దగలం
నేటి వీరులం మేమే
రేపటి మార్గదర్శకులం మేమే

– బి.భూపాల్
9వ తరగతి
జి.ప.ఉ.పా.రంగంపేట

# నాటకరంగం

ఈ ప్రపంచమే ఒక నాటకరంగం,
మంచితనం తెరవెనుక
నటనాసక్తిగలవారు ముఖాన
రంగులు పులుముకొని
మానవతా విలువలను
మంటగలుపుతున్న నటులే
దేశ నలుదిశలా,
నమ్మకమనే ముసుగులో
మగువలను ప్రేమలోకి దింపి
ఆడతనాన్ని కొల్లగొట్టే ప్రబుద్ధులున్న
నటనా రంగం మనది
నీతి.. నిజాయితీల తెర వెనుక
ఆస్తులు కోసం కన్న వారినే కడతేర్చిన
తనయులున్న నాటకరంగం మనది,
కష్టసుఖాల్లో తోడుంటానని
నమ్మించిన నేస్తం
వెన్నుపోటుపొడిచినమ్మకానికి
వమ్ముతెచ్చే మహానటులున్న
ప్రపంచ వేదిక మనది,
ఈ ప్రపంచమే ఓ నాటక రంగం,
సాధు జంతువులతో పాటూ
మేకవన్నెపులులూఉంటాయి
తస్మాత్ జాగ్రత్త"



-రాయవరపు సరస్వతి
7989665525

# జీవనచక్రం

నిన్నటి రోజు ఎందుకో
నాకు చెప్పకుండానే వెళ్ళింది
రేపు వస్తదో రాదో
ఇంకా కబురు చేయనేలేదు.

ఉత్తర ప్రత్యుత్తరాల నుండి
కాలం కొత్త పోకడలోకి వెళ్ళింది
ఇంద్రధనస్సులోకి
తొంగిచూసిన మనసు
కొత్త రంగులకై పరితపిస్తుంది.

ఆశల పల్లకితో దేహం ఊరూరు
తిరుగుతూనే వుంది
ముడుచుకున్న ఆలోచనలు పంచుకోను
నికృష్టమైన లోకంలో మనుషులు
కరువవుతునే వున్నారు.

అంగట్లో బంధాలను అమ్మకానికిపెట్టి
విలువలు లేని సమాజం మీద
డబ్బులు జల్లి
ప్రేమను వెతుకుంటుంది ఈ ప్రపంచం

చమ్కిలద్దుకున్న ఆకాశం
కమ్ముకున్న మబ్బుదుప్పట్లోనుండి
జాలిగా కిందికి చూస్తునే వుంది.

అప్పుడప్పుడు
వలస పక్షిగా వచ్చివెళ్ళే సంతోషం
అద్దం మీద గీతలు గీస్తు
ఏదో సందేహరాగం ఆలపిస్తుంది.

గొంగలి పురుగు నుండి
సీతాకోక చిలుక
రూపాంతరం చెంది మురిపిస్తుంటే..
కొన్నిముళ్ళు... కొన్ని పువ్వులు...
దోసిటి నిండా పోగేసుకున్న జ్ఞాపకాలు

కష్టాల నిప్పులపై కాగిరాలిన కన్నీళ్ళతో
జీవనచక్రపు కథల పుస్తకంలో
ఒక్కో పేజి తిరిగి రాసుకుంటున్నాను



– వజ్జీరు ప్రదీప్
9989562991

# 'మది'రోహాలు

ఆడపిల్లల ఆటల్లో అబ్బాయిలే అయినా
మనం తోడై ఆనందంగా ఆడింది గుర్తుందా?!
అక్కా – చెల్లెల్లు అరమరికలు లేక కర్రబిల్లలు,
గోళీలను మనకై కాచింది మరిచేమా?!
నడిరేయి వరకు ఆడిన పచ్చీసు, అష్ట చెమ్మ,
పులి మేకల ఆటల గుర్తులు వదిలామా?!
ఆశ తీర అర రూపాయికే దోసిల్లు నిండిన
నేరెళ్ల వాసనల నుండి కదిలామా?!
పొద్దు పొడిచే వేళల్లో, సందే పొద్దుల నీడల్లో
కోతి కొమ్మచ్చి ఆటల జ్ఞాపకాలు వదిలమా?!
అన్నీ సుఖాలకు నేడు తావున్నా ఏమైందో
ఆ నాటి ఆ సంతృప్తి సంగీతపు సరిగమ?!
తరగని ఆస్తులున్నా మనసు
చెమ్మ తుడవలేనిదెందుకు ఏ మధురిమా?!



-కె నాగరాజు,
98495 48232

# ప్రకృతి - ప్రగతికి చోదక శక్తి

ప్రకృతి రక్షణ ప్రజల సంరక్షణ
ప్రకృతి సకలజీవులకుజీవ ప్రదాత
ప్రకృతి ప్రగతికి పురోగతికి
చోదక శక్తిమానవ జాతి మనుగడకు
మణిదీపం
సహజ వనరునురక్షిద్దాం
స్వయం స్వమృద్ధి సాదిద్దాం
మానవునిఅనాలోచితచర్యలతొ
పెరుగుతున్నప్రకృతి వైపరీత్యాలు
ఉద్రుతమౌతున్న విపత్తులు
కాలుష్యమౌతున్న ప్రకృతి
మానవ స్వార్థానికి
విధ్వంసమౌతున్న ప్రకృతి
దేశాలమధ్య పోటీ వాణిజ్యవాధం
ప్రకృతి పర్యావరణ పతనానికి
హేతువై పరిశ్రమలు వెదజల్లే
ఘన ద్రవ వాయువులతో
నీరు నేలకాలుష్యమై
మానవమనుగడ ప్రమాదకరమైంది
విశ్వజనావళికి
వైరస్ లేసంపదఅవుతే
అనారోగ్యమె ఆస్తి అయింది
విచ్చల విడి ప్లాస్టిక్ వినియోగం
వరదల ప్రవాహాన్ని అడ్డుకొని
జలప్రళయంతో జనం విలవిల
మానవునివిచక్షణరహిత ప్రవర్తన
ప్రకృతిని కబళిస్తుంది మానవాళి
దురాశ జీవవైవిద్యానికి చేటు
చెరువుల కబ్జావిలాసవంతమైన
విల్లాలతోప్రకృతిని నాశనం చేస్తూ
భూతాపంపెంచేచర్యలుమానుకో
ప్రకృతి పర్యావరణం పట్లజనము
అవగాహన చైతన్యం పెంచుకొవాలి
కాలుష్య రహిత సమాజ స్థాపనకై
ప్రకృతి పర్యావరణ రక్షణకై
పౌర సమాజం ఉద్యమించాలి
అవగాహన చైతన్య తో
జనజాగృతికై ఉపక్రమించాలి
ప్రకృతి ఉద్ధరణ ఉద్యమమై వర్ధిల్లాలి

-నేదునూరి కనకయ్య
9440245771

# ఏవైనా మనకే....

ఏమైందో ఏమో!
ఈ మధ్య ఏపుగా పెరగడానికి
మొక్కలెందుకో మొరాయిస్తున్నాయి
ఆకాశంవైపు చూడాల్సినమొక్కలు
నేలచూపులు చూస్తున్నాయి
నలుగురికి నీడనివ్వాల్సిన మొక్కలు
ఆకులను దులపరించుకుంటున్నాయి
వసంతాన్ని ఆస్వాదించాల్సిన మొక్కలు
శిశిరాన్నాహ్వానిస్తున్నాయి.
నువ్వెన్నైనా చెప్పు
మొక్కలెప్పుడు మొక్కలే !
వాటిలోని
సౌకుమార్యాన్ని వెలికితీయాలేకానీ
ఎలా వుండాలో నేర్పుతాయి
వాటిలో దైవత్వాన్ని
దర్శించాలే గానీ
ఎందుకు చేరదీయాలో చెబుతాయి
వాటిని వాటికే కొత్తగా
పరిచయం చేయాలే కానీ
సమాజానికెంత ప్రాణప్రదమో
నిరూపిస్తాయి
అవి లేత మొక్కలు
అవి పెరుగుతున్న మొక్కలు
అవి పరిమళాలను వెదజల్లే మొక్కలు
ఎప్పుడైనా అవి నీడనిచ్చే మొక్కలు
మనసమక్షంలో
పెరుగుతున్న మొక్కలవి
కట్టుకట్టినా మనమే
కంచెలేసినా మనమే
ఎండిపోకుండా చూసేబాధ్యత మనదే
ఏపుగాపెంచే బాధ్యతా మనదే
పదిమందికి నీడనిచ్చాక
వచ్చే ప్రశంసలూ మనకే..



– ఎన్.నరేశ్ చారి.
9701334516

# అంబేద్కర్ మొగ్గలు

అతి పెద్దదైన భారత రాజ్యాంగం
లిఖించడంలో అగ్రగామిగా నిలిచిన వ్యక్తి
ప్రజాస్వామ్య పరిరక్షణ కర్త ..అంబేద్కర్

అందరికీ సమన్యాయం కల్పించడం కోసం
అహర్నిశలు పాటుపడ్డ చైతన్య కిరణం
గణతంత్ర దినోత్సవ సారధి ..అంబేద్కర్

ఎన్నో ఉన్నతమైన చదువులు చదివి
అత్యుత్తమ పదవి చేపట్టిన క్రాంతదర్శి
జాతికి జీవితం అంకితం చేసిన అంబేద్కర్!

బాల్యంలో అవమానాలు తట్టుకున్నా
ప్రజల అభ్యున్నతికి కృషి చేసాడు
రాజ్యాంగరచన చేసిన మేధావి అంబేద్కర్!

దళితులకు జరిగే వివక్షత తట్టుకోలేక
వారికోసం న్యాయమైన కృషి చేసాడు
భారత సంవిధాన కవచం అంబేద్కర్!

అడుగడుగునా అస్పృశ్యత నివారణకు
మానవ సమాజాన్ని సమైక్యం చేశాడు
సర్వసమానతా ఆకాంక్షించిన అంబేద్కర్!

తనదైన స్వీయప్రతిభతో పైకి వచ్చి
కేంద్రమంత్రి స్థాయికి ఎదిగిన వ్యక్తి
గొప్ప పరిపాలనాదక్షుడు అంబేద్కర్!

ప్రజాస్వామ్య పరిరక్షకుడిగా పేరుగడించి
సంఘసంస్కర్తగా ఎన్నో సేవలు చేశాడు
అందరికీ ఆదర్శప్రాయుడు అంబేద్కర్!



-సునీత బండారు
9440671530

# మనసు మూగపోయింది
(కథ)

ఎన్నేళ్ళ తర్వాతో ఈ ఊళ్ళో అడుగుపెట్టడం చక్రధర్,. అమ్మ గొడవ భరించలేక తప్పనిసరిగా రెండు రోజులు ఆఫీసుకి సెలవు పెట్టి ఈ ఊరొచ్చాడుగానీ లేకపోతే ఈ మారుమూల పల్లెలో కాలు పెట్టడమే ఇష్టం లేదు. పల్లెకి కాస్త దగ్గరలో ఉన్న ఓ మాదిరి ఊళ్ళో లాడ్జిలో గది తీసుకుని స్నానం కానిచ్చి బయటికొచ్చాడు.ఆ పక్కనున్న చిన్న హోటల్ కాస్త శుభ్రంగా ఉన్నట్టే కనిపించింది. వెళ్లి ఇడ్లీలు తిని కాఫీ తాగడం పూర్తయ్యేసరికి ఆటోవాడొకడు వెనకే వచ్చాడు. తను వెళ్ళాల్సిన ఊరి పేరు చెప్పగానే రండి సార్ అన్నాడు. షేరింగ్ ఆటోలు ఇంకా రెండు కనిపించాయి. తనొక్కడే వెళ్లిపోవడం అంటే అయిదుగురు ఇచ్చేది తనొక్కడే ఇవ్వాలన్నాడు. సరే అంటూ ఎక్కి కూచున్నాడు. ఊళ్ళో ఎవరింటికి వెళ్ళాలో చెప్తే ఎవరైనా సరే చెప్పేస్తారు చిన్న ఊరు కదా కష్టమేమీ ఉండదు అన్న అమ్మమాట గుర్తుకి వచ్చింది ఆటో సరిగ్గా అత్తయ్యా వాళ్ళ ఇంటి ముందు ఆగగానే. చుట్టూ చిన్న ప్రహరీగోడ అక్కడక్కడ ఇటుకలు ఊడిపోయి. మధ్యలో చెక్క గేటు సగం విరిగిపోయి ఉంది. లోపల ఇల్లు పడిపోయేలా ఉన్న ఓ పాతకొంప. ఇల్లు వెలవెలబోతోంది కానీ గేటు లోపల అడుగుపెట్టగానే ఆహ్లాదం కలిగిస్తున్న రంగు రంగుల పూబాలలు నందివర్ధనాలు, మందారాలు, కనకాంబరాలు, గులాబీలు, చేమంతులు, దాగని పరిమళాలు సన్నజాజులు రారమ్మని స్వాగతిస్తుంటే ఎంత బావుంది ఆవరణ అనుకుంటూ ఒక్క క్షణం నిలబడిపోయాడు చక్రధర్. బాగా చిన్నవయసులో రజని చెయ్యి పట్టుకుని ఈ ఆవరణలో పరుగులెత్తి ఆడుకోవడం పువ్వులు, పిందెలు కోసేసి తుంపులుగా తను పారేస్తుంటే అలా తుంపి పారెయ్యకు అంటూ వెనకాలే వచ్చి చెయ్యి పట్టుకుని రజని లాగడంతో తాను తూలిపడటం, చేతికి దెబ్బ, తగలటం అన్నీ మనసులో మెదిలి మధురమైన బాల్యం కళ్ళ ముందు నిలిచింది.

ఇన్నేళ్ల తరవాత ఆ జ్ఞాపకాలతో ఆనందబాష్పాలు రాలడం తనకే ఆశ్చర్యం అనిపించింది చక్రధర్‌కి. పెరిగి పెద్దయ్యాక వీళ్ళని కలవనివ్వలేదు అమ్మ. రాకపోకల్లేకుండా చేసింది. ఎందుకు దూరం పెట్టిందో తెలియదు. రెండు నెలల కిందట అత్తయ్యకేదో అత్యవసరంగా సర్జరీ ఏదో చేస్తున్నారని నాన్నగారికి ఎవరి ద్వారానో తెలిసి ఇరవై వేలు ఉన్నపళంగా పంపించారుట. అది ఇప్పుడు తెలిసి పట్టుబట్టింది అమ్మకి. వెళ్ళి ఆ డబ్బు వెంటనే పట్టుకురా వాళ్ల దగ్గరనించి అంటూ అఘమేఘాలమీద తరిమింది తనని. లేకపోతే వీళ్లింటికి ఎందుకు పంపుతుంది.

ఆలోచిస్తూనే తలుపు మీద చిన్నగా తట్టాడు. తలుపు తీస్తూనే "ఎవరు బాబూ!" అంటూ పరీక్షగా చూస్తున్న వ్యక్తిని మావయ్యగా గుర్తుపట్టి "నేను మావయ్యా! శంకరంగారి అబ్బాయిని, చక్రధర్ని" అన్నాడు మెల్లిగా.

"నువ్వు నువ్వు.. శంకరం కొడుకు చక్రధర్‌వా? రారా బాబూ! లోపలికి రా!" మావయ్య మొహంలో కొట్టొచ్చినట్టుగా కనిపిస్తున్న ఆనందం చూసి తెల్లబోలేదు చక్రధర్.

అది తెచ్చిపెట్టుకున్న సంతోషం కాదనీ, నటన కాదనీ అర్థం చేసుకోగలడు. ఎందుకంటే చిన్నప్పుడు తనంటే ఆయనకి ఎంత ఇష్టమో, ఎంత ముద్దు చేసేవాడో, ఎంత ఎత్తుకుని తిప్పేవాడో మర్చిపోలేదు తను.

భుజం చుట్టూ చెయ్యేసి లోపలికి తీసుకుని వెళ్తూ "కమలా! ఎవరొచ్చారో చూడు మనింటికి నా ప్రియాతిప్రియమైన కుర్రాడొచ్చాడు." దాదాపు అరిచినట్టే పిలిచాడు శంకరం,

వంటింట్లోంచి గబగబా ఇవతలికి వచ్చిన కమల నోరు తెరుచుకుని చూస్తుండిపోయింది ఒక్క నిమిషం. ఆ వెంటనే మొహంలో సంతోషంతో కూడిన నవ్వు మెరిసింది. "చక్రధర్ కదూ?" ఎన్నేళ్ళకి చూసినా గుర్తుపట్టగలదు. "అచ్చు మీ నాన్న పోలిక కదా నువ్వు.."

ముందుగదిలోనే గోడవారగా ఉన్న మంచమ్మీద తన పక్కనే చక్రధర్ని కూర్చోపెట్టుకున్నాడు శంకరం. మంచినీళ్లు అందిస్తూ " అమ్మా నాన్నా బావున్నారా?" అని అడుగుతుంటే కళ్ళల్లో నీళ్ళు చెంపలమీద కారడం మాత్రమే కాదు గొంతు కూడా పట్టేసినట్టయింది కమలకి.

లేచి అత్తయ్య చేతిని ఆప్యాయంగా పట్టుకోవాలనిపించింది చక్రధర్‌కి. కానీ ఆ చనువు, ఆ ఆపేక్ష ఎన్నాళ్ల కిందటో తెగిపోయిన దారం కదా ఇబ్బందిగా అనిపిస్తోంది పరిస్థితి. తలంటు పోసుకుని పెరట్లో జుట్టు ఆరబెట్టుకోవడం పూర్తయి అప్పుడే అక్కడ అడుగు పెట్టిన కూతురితో సంబరంగా అన్నాడు శంకరం.

"ఇతనెవరో తెలుసా రజనీ!" ఆమెని చూస్తుంటే కంటిముందు హరివిల్లు విరిసినట్టుంది చక్రధర్‌కి.

"ఎవరో బాగా తెలిసినవాళ్లే అనిపిస్తోంది నాన్నగారూ!" హరివిల్లు నుండి కోకిలరాగం సభ్రమంగా అనిపించింది చక్రధర్‌కి.

"శ్రీనివాసు మావయ్య కొడుకు చక్రధర్. రజని మా అమ్మాయి" ఇద్దరికీ ఒకరినొకరికి పరిచయం చేశాడు.

ఫలహారం ఏదైనా తయారు చేసి పెడదామని గబగబా వంటింట్లోకి నడిచింది కమల. ఎదురుగా ఉన్న స్టూల్ మీద కూర్చుంటూ మావయ్య, అత్తయ్యల కుశలం అడిగింది రజని.

"మంచి మనసుతో మా ఇంట్లో అడుగుపెట్టావు నీకు మా కృతజ్ఞతలు చక్రధర్" అంటూ ఆమె మనసారా పొగుడుతుంటే నోట్లోంచి మాటే రాలేదు.

"ఏమిటో బంధాలు తెగిపోయాయి అని అనుకుంటాం మిడిమిడి జ్ఞానంతో పిచ్చివాళ్ళం. వయసు పెరుగుతున్నకొద్దీ ఆపేక్ష కోరుతుంది మనసు. ఎందుకంటే తెగిపోయాయి అనుకున్న కొన్ని బంధాలు పైకి అలా కనిపిస్తాయి తప్ప గట్టిగా పెనవేసుకునే ఉంటాయేమో మనసులో" చిన్నగా నిట్టూరుస్తూ అన్నాడు శంకరం.

ఉలిక్కిపడ్డాడు చక్రధర్. తనెందుకు వచ్చాడో చెప్పి వీళ్ళ మనసుల్లో కలిగిన ఆనందాన్ని అణిచేసెయ్యాలా? చివుక్కుమంది గుండెల్లో. వేడివేడిగా తనకి ఎంతో ఇష్టమైన రవ్వదోసెలు అప్పటికప్పుడు చేసి ఆప్యాయంగా పట్టుకొచ్చి పక్కన కూర్చుని తినిపిస్తుంటే అత్తయ్యకి అమ్మానాన్నల మీద ఏ మాత్రం కోపం లేదా? ఆ కళ్ళల్లో అంత నిష్కల్మషమైన ఆపేక్ష, అంత ప్రేమా తను చూడగలుగుతున్నడంటే సందేహం లేదు వీళ్ళకెవరికీ తమ కుటుంబం మీద కోపం గానీ అసూయ గానీ లేవు. వీళ్లు ఆర్థికంగా పేదరికంలో ఉన్నారు తప్ప మానసికంగా ఉన్నతమైన స్థానంలో ఉన్నారని అమ్మ లాంటివాళ్లకి ఎలా అర్థమవుతుంది?

"ఇన్నేళ్ళకైనా నీ మేనత్త గుర్తొచ్చినందుకు నేను నా పుట్టింట్లో అడుగు పెట్టినంత సంబరంగా ఉంది నాకు"

భార్యవంక జాలిగా చూశాడు శంకరం. అతనికి తెలుసు ఆమెకి కావలసింది ఆస్తి కాదు, అంతస్తు కాదు ఆత్మీయత. భోజనంలోకి తాను చిన్నప్పుడు ఏమేమి ఇష్టంగా తినేవాడో అవి వండి వడ్డించడం ఆశ్చర్యం కలిగించింది చక్రధర్‌కి. అత్తయ్య ఇప్పటికీ ఎంత గుర్తు పెట్టుకుంది?

"నువ్విప్పుడేం చేస్తున్నావు రజనీ?" అడగకుండా ఉండలేకపోయాడు.

పీ.జీ. చేసి పొదరుల్లో కాలేజ్‌లో లెక్చరరుగా చేరానని చెప్పింది. అంతేగానీ నువ్వేం చేస్తున్నావని తిరిగి ప్రశ్నించలేదు. అగిగితే బావుండును ఎమ్.టెక్.చేసి సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం చేస్తున్నానని చెప్పుకోవాలని కాస్త ముచ్చటపడ్డాడు.

అన్నం తింటున్నంత సేపూ అత్తయ్యతో చిన్నప్పటి సంగతులు తనకి గుర్తున్నవన్నీ చెప్తూ జ్ఞప్తికి రానివి అత్తయ్యని మరీ మరీ వంక మాటి మాటికి చూస్తూనే ఉన్నాడు.

పెళ్ళిసంబంధాలు ఎన్ని వస్తున్నా అమ్మ ఎంత గొడవ పెడుతున్నా ఇప్పుడే కాదు అంటూ గడిపేస్తున్న చక్రధర్‌కి రజని చాలా నచ్చింది. ఇంత అందమైన అత్తయ్య కూతుర్ని ఇన్నాళ్ళవరకూ చూడకపోవడం ఎంత పొరపాటై పోయింది అనిపించింది. పోన్లే ఈ రోజు ఏ కారణంవల్లనైతే ఏమి ఇక్కడికి రావడం మంచిదైంది అనుకున్నాడు. రజనితో ఒంటరిగా మాట్లాడే సమయం కోసం ఎదురు చూశాడు.

ఆ సమయం మరి కొద్దిసేపట్లోనే రానే వచ్చింది. డాబా మీద బట్ట లారెయ్యడానికి రజని వెళ్తుంటే తనూ బయల్దేరాడు కాలక్షేపానికి డాబా మీదకి వెళ్తున్నట్టు. ఇంకొంచెంసేపట్లో తను మళ్ళీ ఊరికి బయల్దేరాలి. ఈ లోపల తన మనసు రజనికి తెలియజెయ్యాలి. ఆమె చేత ఓ.కే. అనిపించుకోవాలి. తప్పకుండా ఓ.కే అంటుంది. ఎందుకు అనదూ అన్న ధీమా ఉంది. ఔను. తనకేం తక్కువ అన్న గర్వమూ ఉంది.

ఒక్కొక్క బట్టా బక్కెట్‌లోంచి తీసి రజని తాడుమీద ఆరేస్తుంటే మెల్లిగా మాట కలిపాడు "నువ్వు పెద్ద చదువు చదువుకున్నావు. నాకు చాలా సంతోషంగా ఉంది రజనీ.."

"ఏం? చదువుకోదని ఎందుకనుకున్నావు? టక్కున వచ్చిన ఆ ప్రశ్నకి సమాధానం చెప్పలేకపోయాడు. అబ్బే అహ ఏం లేదు అంటూ మాటలు మింగేశాడు. వింతగా ఒక్క క్షణం చూసి మళ్ళీ తన పనిలో పడింది రజని.

పట్నం అమ్మాయి కాదు కాబట్టి చాలా తేలిగ్గా రజనితో మాట్లాడెయ్యగలనని అనుకున్నాడుగానీ ఎలా మొదలెట్టాలో తెలియక కొంతసేపు తర్జన భర్జన పడిన మాటనిజం. తనకి అందం ఉంది చదువు ఉద్యోగం ఉంది. ఆస్తీ అంతస్తు ఉన్నాయి. వీళ్ళకి డబ్బు లేదు. పల్లెటూళ్ళో ఉంటున్నారు. తనలాంటి వారు చేసు కుంటానంటే ఎగిరి గంతేసి ఒప్పు కుంటుంది. ఎందుకు ఒప్పుకోదూ!

బక్కెట్లో బట్టలైపోయాయి.ఎ రజని డాబా దిగి వెళ్ళిపోతుందన్న కంగారుతో అప్పుడు నోరు విప్పాడు.

"రజనీ సూటిగా చెప్పేస్తున్నానను. నిన్ను పెళ్ళి చేసుకుందామని ఉంది. అత్తయ్యతో మాట్లాడనా ఈ విషయం?" రజని కళ్ళల్లో కనిపించిన ఆశ్చర్యం చూసి అది సహజమే కదా అనుకున్నాడు. కానీ తర్వాత ఆమె ఇచ్చే సమాధానం తనకి ఆశ్చర్యం కలగ జేస్తుందని ఊహించలేదు.

"వద్దు" చాలా మృదువుగానే చెప్పింది కానీ స్థిరంగా పలికింది.

అడగకుండా ఉండలేకపోయాడు "నీకు ఇష్టం లేదా?" అని

ఐనన్నట్టుగా తల ఊపింది. ఇలాంటి పరిస్థితి ఎదురవడం ఆమెకి ఇబ్బందికరంగానే ఉంది. ఎవరినైనా ప్రేమించిందేమో అన్న అనుమానం వచ్చి, ఇంతదాకా వచ్చాక ఇంక ఆ సంగతి అడిగేస్తే తప్పులేదని అనిపించింది.

"లేదు చక్రధర్. అమ్మా,నాన్నగార్లు చూసిన సంబంధమే చేసుకుంటాను.."

"మరైతే అత్తయ్యతో మాట్లాడతానంటే వద్దంటావెందుకూ?" ఆడవాళ్ల మనసు అర్థం చేసుకోవడం కష్టమని ఇందుకే అన్నారేమో! విసుగుని కప్పిపుచ్చుకుంటూ మామూలుగా ఉండడానికి ప్రయత్నించాడు.

"నేను చెప్పేది నువ్వు సరిగ్గా అర్థం చేసుకుంటావనే ఆశిస్తున్నాను చక్రధర్! నాకు మీ కుటుంబంలో ఎవరి మీదా ఏ కోపం లేదు. అంతమాత్రంచేత నిన్ను పెళ్ళి చేసుకునే ధైర్యం నాకు లేదు. మీ అంతస్తుకి మేము సరితూగమని ఇన్నేళ్లుగా మిమ్మల్ని దూరం పెట్టింది అత్తయ్య.రాకపోకలు తను ఆపుచెయ్యడమే కాదు పొమ్మన లేక పొగపెట్టిన రీతిలో మాచేత కూడా ఆపుచేయించింది. మిమ్మల్ని ఎంత చులకనగా చూస్తుందో పెద్దయ్యాక నీకూ అర్థమయ్యే ఉంటుంది కదా! నేను చెప్పక్కర్లేదు. అటువంటప్పుడు ఇంతకాలం తర్వాత నువ్వు రాక రాక మా ఇంటికి వచ్చి తిరిగి వెళ్ళాక నన్ను పెళ్ళి చేసుకోదల్చుకున్నానని అత్తయ్యతో చెప్తే అది నీ స్వంత అభిప్రాయంగా ఆవిడ తీసుకోదని నేను ఖచ్చితంగా చెప్పగలను. అసలే ఆవిడ దృష్టిలో చులకన అయిపోయిన మేము మరింత దిగజారిపోయిన వాళ్లమవుతాము.."

"ఎందుకలా అనుకుంటున్నావు?"

"పెద్దయ్యాక నువ్వు మా ఇంటికి రావడం ఇదే కదా! నిన్ను మేము బుట్టలో వేసుకున్నామంటుంది. పెళ్లికి ఒప్పించామంటుంది. జీవితాంతం ఆవిడికి ఆ అభిప్రాయం ఉండిపోతుంది. నేను ప్రశాంతంగా ఉండలేను. నేనే కాదు మన ముగ్గురి జీవితాల్లోనూ మనశ్శాంతి ఉండదు. అలాంటి పరిస్థితి కోరి కోరి తెచ్చుకోవడం అవసరమంటావా? ఇలా చెప్పవలసి వచ్చినందుకు నాకు చాలా బాధగానే ఉంది చక్రధర్! దయచేసి ఏమీ అనుకోవద్దు కిందకి వెళ్దామా ఇంక.."

మౌనంగా రజని వెనక మెట్లు దిగాడు చక్రధర్. సాయంత్రం తినడానికి ఏవేవో రకరకాలు చేసి తినమంటున్న అత్తయ్యని తదేకంగా చూశాడు మళ్ళీ వీళ్ళని ఎప్పుడు కలుస్తానో అనుకుంటూ. నాలుగు రోజులు ఉండమని ముగ్గురూ కూడా ఎంత చెప్పినా పనులున్నాయి అంటూ బయల్దేరిపోయాడు. తను చేసిన తీపి కారం ఫలహారాలు ప్లాస్టిక్ డబ్బాల్లో సర్ది ఒక సంచీలో పెట్టి వెళ్ళగానే అమ్మకియ్యి అంది కమల.

ఆటో పిలుచుకొచ్చి తననుకూడా బస్‌స్టాండ్‌కి వచ్చాడు శంకరం. బస్ రావడానికింకా కొంచెం సమయం ఉంది. అమ్మ చెప్పి పంపిన అసలు విషయం డబ్బు సంగతి ఎలా ప్రస్తావించాలో అర్థం కాలేదు. సరిగ్గా అప్పుడే చక్రధర్ రెండు చేతులూ పుచ్చుకున్నాడు శంకరం "మీ నాన్నకి మరీ మరీ ధన్యవాదాలు చెప్పానని చెప్పు. మీ అత్తయ్యకి విజయవాడలో సర్జరీ చేసినప్పుడు ఏదో పనిమీద విజయవాడ వెళ్తున్న మీ మేనమామ చేత నాకు ఇమ్మని డబ్బు పంపించాడు మీ నాన్న, అదృష్టవశాత్తూ నాకు అప్పటికే డబ్బు సమకూరింది. అందుకని నాన్న పంపిన డబ్బు తీసుకోలేదు నేను. తిరిగి మీ నాన్నకి ఇచ్చేసెయ్యమని అప్పుడే చెప్పేశాను. తీసికెళ్ళిపోయాడాయన. తిరిగి పంపించేస్తున్నందుకు క్షమార్పణ అడిగానని కూడా చెప్పమన్నాను. మళ్ళీ ఇంకోసారి నువ్వు కూడా చెప్పు మీ నాన్నకి క్షమించమని అడిగానని.."

చక్రధర్‌కి నోట మాట రాలేదు. మేమామ ఒక రూపంలా కాదు ఒక గోడలా ఆత్మీయతకి అడ్డుగోడలా కనిపించాడు.

"ఇప్పుడీ సంగతి ఎందుకు ప్రస్తావించడం అని నువ్వు అనుకోవద్దుజ. కానీ మీ ఇంటికి మేము రావడంగానీ, మా ఇంటికి మీరు రావడంగానీ ఏదీ జరిగేందుకు ఆ ఘడియ రాలేదు. వ్యక్తిగతంగా ఈ విషయం చెప్పాలని ఎదురు చూస్తున్న నాకు అవకాశం ఇచ్చావు నువ్వు, నీకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను.."

శంకరం మావయ్య కళ్ళల్లోకి చూస్తుండిపోయాడు చక్రధర్. మనసు మూగపోయినట్లయింది.



-తమిరిశ జానకి
9441187182



# వి మిస్ యూ మిస్సమ్మ

తొలి తరం నటీమణి
తెలుగింటి సత్యభామ
కన్నడ హంపీలో జననం
మెట్టినిల్లు భాగ్యనగరం
'పుట్టిల్లు'తో తెరంగేట్రం !

'మూగ మనసులు'తో..
కన్నీరు పెట్టించిన తార
టాలీవుడ్‌కే 'తోడు నీడ'గా..
'పూజా ఫలం' పుణ్యాన..
'పండంటి కాపురం' చేసి..
'పెళ్లి రోజు' రమణతో 'సంతోషం' !

'నిండు కుటుంబం'తో..
'సంసారం' 'దీక్ష' చేసి..
'బంగారు పాప'ను కని..
'బంగారు కొడుకు'కే జన్మనిచ్చి..
'సతీ అనసూయ' దారిన..
'మట్టిలో మాణిక్యం' జానాభాయి !

'భూకైలాస్'లో వెలుగులు చిమ్మి..
ఇంటింటా 'ఇల్లరికం' చేసి..
'రాజకీయ చదరంగం' ఆడి..
'అప్పు చేసి పప్పు కూడు' తినని..
'భాగ్యరేఖ' మన 'చింతామణి'..
స్వర్గానికేగెను నవరస నట శిఖరం !

వెండి తెర అల్లరి పిల్ల..
'మిస్సమ్మ'తో మెప్పించి..
ఉక్రోషంతో ఊగిన మరదలు
మన తెలుగింటి సత్యభామ
మరణమే లేని మహానటి
మనందరి జమున రమణారావు !



– డా॥ బుర్ర
మధుసూదన్ రెడ్డి
99497 00037

# నవరస కళా వాణి జమున

ఆమె ఓ అందాల రాణి
సొగసైన కనుముక్కు తీరు
పొగరూ వగరు ఆభరణాలు
వెరసి నవరస కళా వాణి జమున.

గోదారంత అందం
కవుల వర్ణన కతీతం
క్రమ శిక్షణ ఆరోగ్య రహస్యం
నటనకు తనదైన భాష్యం.

మచ్చ లేని సంసార జీవితం
మరువలేని నటనా చాతుర్యం
మకుటాయమానం మిస్సమ్మ చిత్రం
సత్యభామ పాత్ర అజరామరం.

సినీ వినీలాకాశంలో ధృవ రత్న
సినీ నటీమణులకు ఆదర్శ రత్న
సేవా కార్యక్రమాల మణిరత్న
అభిమానుల మదిలో సుస్థిర రత్న.

నటనకు దూరమైనా
సాహితీ సాంస్కృతిక కార్యక్రమాల
ముఖ్య అతిథిగా
బుల్లి తెరపై కనిపించే సినిమాలలో
ఆకాశవాణిలో వినిపించే పాటలతో
అభిమానుల హృదయాల్లో
నిత్య నూతన నటీ శిరోమణి జమున
ఆమె స్మృతికివే అశ్రు నయనాల నివాళి



–డా. కేతవరపు రాజ్యశ్రీ
8500121990

# తొలితరం నటీమణి



చిగురుటాకు దశ నుండి పండుటాకు దశ వరకూ
ద్విశత చిత్రాలలో నటించిన కళామతల్లి
ప్రవాళహారం. పికాసోచిత్రాల సౌందర్యం,
మైఖేల్ ఏంజిలియో శిల్పాల లావణ్యం,
బాపూబొమ్మల సౌకుమార్యం సమ్మిళితమైన అరుదైన నటీమణి.
ఆమెయే "జమున"గా మారిన జనాబాయి.
తనకంటే సీనియర్లతోను, జూనియర్లతోను కూడా
సమాన భావనతో సరిపోయిన జతగా కథానాయికగా
నటించిన ప్రత్యేక సినీతార!
కథానాయికగా గర్వించక,
ద్వితీయ కథానాయికయైనాన్యూనత
చెందక చిత్ర విజయాలకు కల్పతరువుగా నిలిచిన
నిర్మాతల భాగ్యనాయిక.
విషాదనాయికగా, చిరంజీవులు,
మట్టిమనుషులు చిత్రాలలోను,
హుందాతనం, అధికారులకు గుణ హావభావాలతో,
భగ్నప్రేమతో
కలెక్టరు జానకిగా,
అపార్థం, నియంతృత్వం,
పశ్చాత్తాపాలతో రాణీ మాలినీదేవిగా,
చిలిపితనం, చలాకీతనం, గయ్యాళితనం,
సౌజన్యం, త్యాగ
గుణాలతో మూగ మనసులలో గౌరిగా,
మాతృప్రేమ, నైరాశ్యంతో యశోదగా, ఆమె ప్రదర్శించిన
అభినయవైభవం, కళారంగంలో ప్రత్యేక గ్రంథం.
ఆమె, సత్యభామగా శృంగారం, అంగారం,
అహంకారం, చివరికి
జ్ఞానోదయం వ్యక్తీకరించిన తీరు, విశ్వనటులకు పాఠ్యబోధన.
వైకుంఠంలోని సత్యభామ, మళ్లీ భూమి మీదకు వచ్చి
జమునలో ఆవహించి,
ఆరున్నర దశాబ్దాలు మన మధ్య
నడచి నిష్క్రమించింది.
(సుప్రసిద్ధ నటీమణి జమునగారి నిర్యాణ సందర్భంగా)



-వి.ఎస్.వి. ప్రసాద్
సెల్ : 8106320576

# జీవిత సత్యం

నీ దేశం – నీ వేషం
నీ భాష – నీ యాస
నీ సంస్కృతి – నీ సంప్రదాయం
నీ కష్టం– నీ సుఖం
నీ విజయాలు – నీ అపజయాలు
నీ ఉద్యోగం – నీ సద్యోగం
నీ రాబడి – నీ పోబడి
నీ ఆదాయం – నీ ఖర్చు
నీ మంచి– నీ మమత
నీ మతి – నీ గతి
అన్నీ ....
సెన్సార్ లేకుండా పారదర్శకంగా..
మీ పిల్లలతో పంచుకొంటూ
వారిని పెంచుకో ...
అప్పుడు వారు దేశోద్ధారకులు
కాకున్నా..
తప్పకుండా
మంచి ప్రయోజకులు అవుతారు.
ఇది జీవిత సత్యం.



-కనకయ్య మల్లముల
9440554042

# చేసే మంచి పనులు వల్ల వ్యక్తులు చిరంజీవులు



ఫణిభార్గవ్ జయంతి సభలో పురస్కార గ్రహీతలతో రాయప్రోలు వెంకటరమణ, దైవజ్ఞశర్మ, బైస దేవదాసు, డా॥ ఎం.కె.దాసు, డా॥కె.వి.రమణ, డా॥ రెంటాల జయదేవ్, డా॥ నాళేశ్వరం శంకరం.

–ప్రభుత్వ సలహాదారు
డా॥ కే.వీ.రమణాచారి



డా॥ నాళేశ్వరం శంకరం, జర్నలిస్టులు ఏ. అజయ్‌కుమార్, దామోదర్‌లకు నగదు పురస్కారం ప్రదానం చేస్తున్న డా॥ కె.వి. రమణాచారి.

వ్యక్తులు చేసే మంచి పనులు వలన చిరంజీవులుగా సమాజంలో నిలిచి ఉంటారని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే.వీ. రమణాచారి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బా రావు కళావేదికపై కళా నిలయం సాంస్కృతిక సంస్థ నిర్వహణలో తెలంగాణ అభిమాని విద్యార్థి నాయకుడు ఫణి భార్గవ్ జయంతి సందర్భంగా ఆయన పేరిట నగదు పురస్కార ప్రదా నోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని పురస్కారాలను జర్నలిస్టులు దామోదర్, అజయ్ కుమార్, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం, వేద పండితుడు వీణాపాణి శాస్త్రికి బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రమణ తన కుమారుడు ఫణిభార్గవ్ మరణాన్ని జీర్ణించుకొని ఆయన పేరిట ప్రతిభావంతులు, అవసరం ఉన్న వారిని ఎంపిక చేసి నగదును బహూకరించటం అపురూప దృశ్యం అన్నారు. ఫణి చిన్నతనం నుంచే సామాజిక చైతన్యం తో పది మందికి ఉపయోగపడే పనులు చేసి శాశ్వత యశస్సు పొందారని కొనియాడారు. కవి డాక్టర్ యం.కె.రాము అధ్యక్షత వహించిన సభలో సినీ విశ్లేషకులు సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ రెంటల జయదేవ్, నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసులు ఫణి భార్గవ్ సేవా భావం, రాజకీయ స్పృహ గురించి వివరించారు. సురేందర్ పుష్ప కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. నాట్య గురువులు ప్రవల్లిక, సుష్మ శిష్య బృందంతో కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి.

పుస్తక సమీక్ష

# మహిళలపై క్రౌర్య దుష్టత్వంపై కవయిత్రి 'సలీమ' ధిక్కార స్వరం

మహిళలపట్ల వివక్ష, పాశవిక లైంగిక దాడులు, హింస, కుటుంబం కోసం సమాజం కోసం వారు పడే శ్రమ, పారాటతత్త్వం 'సలీమ' కవయిత్రిగా తనను కలచివేసిన సంఘటనలను కవితలుగా 'జవాబు కావాలి' కవితా సంపుటి ప్రచురింపచేసారు. ప్రత్యేకంగా, ముస్లిమ్ సంప్రదాయ కుటుంబాలలోని మహిళల జీవన దృశ్యాలను కళ్ళకు కట్టించినా, భాష ఏదైనా మతం ఏదైనా **'పడికిలే సమాధానం'**గా పురుషాధిక్య సమాజ వైఖరి ధిక్కారం నినదింపచేసారు.

**'ప్రశ్న మొదలయింది'** కవితలో **"తరతరాలుగా అతని హుకుంలకు భయపడి జీహుజూర్ అన్న ఆమె, మనిషిగా బతకడం ఇప్పుడిప్పుడే మొదలుపెట్టింది"**అంటూ **ఆశావా**దాన్ని స్ఫురింపచేసారు. **'చేతులకు ప్రణామం', 'అజరామరం'** వంటి కవితలలో కరోనా కల్లోల నేపథ్యంలో





పారిశుధ్య కార్మికులు, నర్సులు, ఆయాల శ్రమ ఔన్నత్యాన్ని ప్రశంసించారు. **'ఛేదిస్తాను'** కవితలో

**"ఈ నిశ్శబ్దాన్ని
ఎప్పటికైనా ఛేదిస్తాను
ఆశలు కోల్పోతున్న
మహిళా లోకంలో
కొత్తశక్తిని పుట్టిస్తాను
అందమైన మార్పులే శ్రమిస్తాను"** అంటారు. తాను వస్తుందని ఆశిస్తున్న సమానత్వం కోసం, ఎదురు చూస్తూ నిరీక్షిస్తూ, పోరాడుతూనే వుంటానని **'నిరీక్షణ ముగుస్తుంది'** కవితలో **'సలీమ'** విశ్వాసం వ్యక్తం చేస్తారు.

**'జవాబు కావాలి'** కవితా సంపుటిలోని 41 కవితలు ఉద్యమకారిణిగా మహిళల విముక్తికి సంబంధించిన పోరాట పటిమ వ్యక్తమవుతోంది. **'రగిలించే జ్వాల'**లో మహిళను మండించే శక్తిగా కవయిత్రి స్ఫురింపచేస్తారు. **'పోటెత్తిన కెరటాలు'** కవితలో

**"నింగికెగిసిన ఆ ఆశలన్నీ
పోటెత్తిన కెరటాలై
ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి"**

అంటారు. ఉద్యమశీలిగా, జర్నలిస్టుగా, కవయిత్రిగా వర్తమాన సమాజంలోని మహిళల జీవన వేదన, అణచి వేత, వివక్ష, అన్యాయ, అసమానతలపై పోరాటంలో భాగంగా **"అమ్మాయిని ఆడపిల్లగా కాదు ఆడపులిగా పెంచాలని"** ఎస్.కె. సలీమ తల్లిదండ్రులకు సూచిస్తూ **'జవాబు కావాలి'** అని ప్రస్తుత సమాజాన్ని నిలదీస్తున్నారు.

**ప్రతులకు:** ఎస్.కె.సలీమ
ఎం.హెచ్. భవన్, 21/1
అజామాబాద్ ఇండస్ట్రియల్
ఏరియా, హైదరాబాద్–500 020.



–జయసూర్య
సెల్:9014948336
9394775088

# ఆ శిశువు కళ్ళలోని కాంతులు రాబోవు తరాలకు వేగుచుక్కలు



–మహాకవి డా.కత్తి పద్మారావు
సెల్: 9849741695

ఆ అడవి విరగబూసింది
ఆ బృందావనం వాడిపోయింది
కృత్రిమమైనవన్నీ శిథిలమవుతున్నాయి
సృజనాత్మకమైనవన్నీ
చిగురిస్తున్నాయి
ఆ సముద్ర గర్భంలోని పడవ
లాంతరు కాంతికి చేపల గుంపులు
కళ్ళు తెరిచాయి
నక్షత్ర మండలం
సముద్రంలో ప్రకాశిస్తున్నట్లుగా అనిపిస్తుంది.
ఆ వాచాలుడు
అతీతమైనదేదో ఉందని
దానికోసం వెదకటమే
జీవిత పరమార్థం అని
ప్రవచిస్తున్నాడు
అతడి మాటలు వినసొంపుగా ఉంటాయి
కానీ ఆ మాటల్లో సారం లేదు
వారు జీవితాన్ని కోల్పోయిన
పరాన్న భుక్కులు
మాటల గారడీనే జీవన సత్యంగా
చెప్పుకుని బతుకుతున్నారు
పదార్థ మూలం మీద చర్చించే.

ధైర్యం వారికి లేదు
బొగ్గు గలిలో రంధ్రాలు పడిన
చేతి మీద ఉండే
నెత్తుటి చుక్కల గురించి
వారికి తెలియదు
వారు కవులే కాదు
వారి మాటల్లో
జీవితంలో ఉండే
లోతు లేదు
జీవితంలో నెట్టబడిన వారు వీరు
వీరి ధ్వనులకు
చెవులు రంధ్రాలు పడుతున్నాయి
వీరే ప్రోక్తలు
వీరే శ్రోతలు
స్వీయ స్తుతి ప్రియులు
పూర్వ గాథా లహరిలో
కొట్టు మిట్టాడే నిర్జీవ కృతులు వీరు
నిజమే!
దేశమంతా దేవాలయాలు నిర్మిస్తున్నారు
సోమరులకు అన్నదానం చేస్తున్నారు
శరీరాలకు చెమట పట్టని
దీర్ఘ కాయుల భజన మందిరాలలో
విగ్రహాలు ఊరేగుతున్నాయి
ఏదీ లేదో దానికోసం ఆరాటం.
ఏది ఉందో దానిపై నిర్లక్ష్యం
పంచేంద్రియ జ్ఞాన శూన్యులు
చెప్పే మాట
తప్పక అనృతమని వారికి తెలుసు
సీతను రాముడు తగలబెట్టిన ఘట్టాన్ని
సౌందర్యంగా చెబుతారు.
తన కూతురు సాటి యువకుడిని ప్రేమించింది
ఆ కులాంతర జీవన సంస్కృతిని
జీర్ణించుకోలేక తన్ను తాను దహించుకున్నాడు
మానవ పరిణామం తెలియని అభాగ్యులు వీరు
ఎన్నో మెదడులకు బూజు పట్టించిన
వాచస్పతులు వీరు
జీవితాన్ని కులం గీతల్లోకి నెట్టి
అందులో రక్షణను వెదుకుతున్న
అసాంఘికులు
ఇతరుల గుండెల్లో గుచ్చే బాణాలకు
పదును పెట్టే వాజపేయులు
మహిళల జీవన సౌరభాలపై
కపట వ్యాఖ్యానం చేసి
బ్రతుకుతున్నారు
ఒక కన్నీటి బొట్టు
అక్షరాలలో పొదగలేక
సిగార్లు కాల్చి కాల్చి
మందు సీసాలను ఖాళీ చేసే
పండిత మాన్యులు వీరు
తెలుగు భాషకు వన్నె తెచ్చే
మట్టెల మోతలు వినలేని
కపటులు వీరు
ఉక్కు పొరలు పేర్చిన
కర్ణభేరులు ధరించిన
సంగీతేతర గార్ధభ
ధ్వని ప్రియులు వీరు
ఆ నాట్లు వేసే పడుతుల
పాటల లోని నదీ తరంగాల
స్వర నిత్య వనాలు వినలేని
బధిరులు వీరు
కొత్త చట్టిలో ఉడుకుతున్న
తునకల వాసనలోని గుభాళింపులు
ఆస్వాధించలేని
అసాంఘికులు వీరు
మానవ పరిణామాన్ని నిర్వహిస్తున్న
జన సమూహాల పాదముద్రలను తాకలేని
వైయక్తికులు వీరు.
ఆ దళిత వాడలో కుక్కిమంచంలో
ఒక సూర్యబింబం పుట్టింది
అది రాబోయే తరాలకు వేగుచుక్క
ఒక నల్ల కలువ
ఒక నీలి కేక.
దానిని అందుకోలేక
దాని వెనుక రేపు నడుస్తారని
వారికి తెలియదు
చార్వాకంలోని భౌతిక వాదాన్ని
బౌద్ధంలోని సాంఘిక వాదాన్ని
సావిత్రిబాయి పూలేలోని
స్త్రీ విద్యా వాదాన్ని
అంబేద్కరులోని సమతా వాదాన్ని
అందుకోలేని అవిద్యాపరులు వీరు
సమాజం శబ్ద కాలుష్యంతో నిండిపోతుంది
సత్యేతరమైన విధ్వంసక శబ్దాలు
బలిసిన కాళ్ళ చప్పుళ్లకు
పాటలు రాసే
అక్షర వ్యాపారులు వీరు
నిజమే! సజీవమైన కవి
మీగడ తరకల కంటే మెత్తదనం
కాగుతున్న నెయ్యిలోని సువాసన
తుమ్మెదల గుంపులోని సుస్వరం
శ్రమజీవుల అడుగుల
చప్పుళ్ళలోని సవ్వడి
అక్షర శిల్పాలలో చెక్కి
రాబోయే తరాలకు
జీవన సంస్కృతుల
ఆత్మీయ దర్శనాలు కావించే
నేటి కవుల ఆవిర్భావం
సూర్యుడు ఎక్కడో లేడు
దళిత వాడల్లోని
శిశు జననంలోనే ఉన్నాడు
ఆ కళ్ళలోని కాంతులు
రాబోయే తరాలకు వేగుచుక్కలు.

పుస్తక సమీక్ష

# మేటి కవితల ఘనాపాఠి.. కర్నాటి





సృజనశీలి, అధ్యాపకులు నిత్య చింతనులయిన డా॥ కర్నాటి లింగయ్య ముప్పయికి పైగా వచన గేయ కవితా కృతులతొ తెలుగు సాహితీమతల్లి గళ సీమనలంకరించారు. సమాజానికి నాడీ వ్యవస్థలాంటి అర్థశాస్త్ర ప్రావీణ్యుడు. సమాజానికి శ్రేయస్సు చేకూర్చే సాహిత్యాభిమాని. కవ్వడివలె రెంటికీ సమన్వయం చేకూర్చుతూ ఎన్నో పురస్కారాలు ప్రశంసలు పొందిన ధన్య జీవి, రీటయిరయ్యాక ఆధ్యాత్మిక సేవ అనే మరో ప్రశంసా పాత్రమైన ప్రవృత్తినెంచుకుని ఇహపరాలకు అవసరమైన ఇంధనాన్ని ప్రోవు చేసుకుంటున్న ఆదర్శమూర్తి.

సాహిత్యమే శ్వాసగా చేసికున్న లింగయ్యగారు అనునిత్యం తన జీవి తంలో ఎదురైన ప్రతి అనుభవాన్ని, ప్రతి మహా పురుషుడిని, ప్రతి సంఘటననూ కవిత్వంగా మలుస్తున్నారు.

ప్రస్తుత వచన కవిత్వ సంపుటి **"హరివిల్లు"**లో వంద కవితలున్నాయి. నీటి కణాలతో నిండిన మేఘాలగుండా కాంతి కిరణాల ప్రయాణం ఇంద్ర ధనస్సయి, చూపరికి మనోల్లాసము కలిగించినట్లు, ఆ, యా, విషయాలు వ్యక్తులు సంఘటనలు లింగయ్యగారు అనుభూతించిన ప్రతి భావన అక్షరమై, అక్షయమై నిలిచాయి. 'బాపూజీ' ,వల్లభభాయి పటేల్, కలాం, పొట్టి శ్రీరాములు, నెహ్రూ, ప్రకాశం పంతులు, జ్యోతిబాపూలె, దాశరథి, గాన గంధర్వుడు ఎస్.పి. బాల సుబ్రహ్మణ్యం, సౌందర్య, పి.వి., సినారె. కాటన్‌దొర, నెల్సన్ మండేలా, కొణిజేటి రోశయ్య కల్నల్ సంతోష్‌బాబులాంటి నిన్నటి మహనీయులే కాదు, నటకిరీటి రాజేంద్రప్రసాద్, డైలాగ్‌కింగ్ సాయికుమార్, యువనాయక కిశోరం కె.టి.ఆర్. బహుముఖ ప్రజ్ఞాశాలి కె.వి.రమణాచారి, జ్ఞాన సంపన్నుడు సత్య నాదెండ్లలను వీరి కలంతో మన ముందు నిలుపుతారు. స్వాతంత్ర్య దినం, తెలంగాణ ఉద్యమం ఆరోగ్య దినోత్సవం, కార్గిల్ విజయోత్సవం, కొత్త సంవత్సరం, విజయ దశమి, వికారి ఉగాది, సంక్రాంతి సంబరాలు, కరోనా మహమ్మారి లాంటి చరిత్రలో నిలిచిపోయిన సంఘటనలను తన హృదిలో పదిల పరచుకోవటమే కాకుండా మన మదిలో కూడా నిలుపుతున్నారు.

అభివ్యక్తి కవిత్వానికి పూర్తిశక్తి. ఆకట్టుకోవటంలో అదే మూల పదార్థం అన్న గ్రహింపు వీరిలో మెండు. **"పట్టుదలతో పని ప్రారంభించి/ ధైర్య సాహసాలతో విజయం సాధించిన ధీరుడు"** అని అమరజీవి పొట్టి శ్రీరాములును నుతించినా 'రామేశ్వరం నుండి రాష్ట్రపతిగా ఎదిగి/ భారతదేశానికి కీర్తి కిరీటం' అని కలాంకు సలాం చేసినా, **'మాట తప్పని మహో న్నతుడు/ భవిష్యత్ తరాలకు ఆదర్శనీయుడు'** అని జ్ఞాన సంపన్నుడు, తెలుగు తేజం సత్య నాదెండ్లను తన కలం వెలుగులో మనకు చూపినా ఎక్కడా అతిశయోక్తిలు అవసర వర్ణనలు లేకుండా సరళమైన భాషలో సూటిగా చెప్పారు. భాషా సారళ్యతలోనే సౌందర్యం ఉంది అని నిరూపించిన నిరుపమాన కవి డా॥ కర్నాటి లింగయ్య.

'వచన కవిత్వానికి రసం, ధ్వని ఔచిత్యం అవసరమని ఆ అవసరాన్ని గుర్తెరిగిన కవి కర్నాటిగారు' అని ఎస్.ఆర్. పృథ్వీ తన ముందు మాటలో చెప్పిట్లు కర్నాటిగారి కవిత్వంలో వీటన్నింటినీ అనుభూతించ గలుగుతాము. ఇందులోని కవితా వస్తువులు చాలా విస్తృతమైన అర్థం నేపథ్యం కలిగినవి అని ప్రొ॥ సూర్యాధనం జయ్‌గారు ఈ 'సాహిత్య హరివిల్లు'ను అభివర్ణించినా, అది ప్రత్యక్షర సత్యం, వీరి వయస్సు 78 సంవత్సరాలు అయినా కర్నాటి కవిత్వంలో నవత్య ఉంది. నాణ్యత ఉంది. వర్ధమాన కవులు వీరిని స్ఫూర్తిగా తీసుకోదగ్గ పరిణతి ఉంది. కవికి అభినందనలు.

**ప్రతులకు:**
నవోదయ బుక్ హౌస్
ఆర్యసమాజ్ ఎదురుగా
కాచిగూడ,
హైదరాబాద్–500 027.



– కూర చిదంబరం
సెల్: 8639338675

# మెమొరీ లాస్

మరకే కాదు...
మరుపూ మంచిదే!
మరిచి చూస్తూనే కదా
మరుపు మాధుర్యం మనసుకు తెలిసేది?

కన్నవారి మమతానురాగాల్ని.. త్యాగాల్ని
ఎన్నక మరిస్తేనే కదా..
రెక్కల బలిమిన పక్షులై ఎగురుతూ..
ముదిమికి చేరిన వాళ్ళని
ఈకల్లా ఆశ్రమాల్లో విదిల్చేది?

తోబుట్టువుల బంధపు అందాన్ని.. అనుబంధాన్ని
అట్టే పట్టించుకోక వదిలేస్తేనే కదా
కావాల్సినది సమకూర్చుకున్నాక, అన్ని సంబంధాల్ని
కూరలో కరేపాకుల్లో ఏరి వేసేది?
వేలుపట్టి నడిపిన వాళ్ళ అభిమానాన్ని.. అపురూప ప్రేమని
వీలు వెంట మరిచిపోతేనే కదా
అవసరం తీరాక్కూడా అతుక్కుని ఉన్నవాళ్ళని
పండుటాకుల్లా రాల్చివేసేది?

చిన్ననాటి స్నేహితుల చెలిమిని. చేయూతని
ఎన్నాళ్ళో గుర్తుంచుకోక ఏమారితేనే కదా
ఆపదలు గడిచి.. అందలాలెక్కాక
పాత క్యాలెండర్లలా పక్కన బెట్టేది?

మనిషికి దేవుడిచ్చిన మరుపు మర్మాన్ని..
మేటి వరాన్ని..
ఈ మధ్యనే కచ్చితంగా గుర్తించి
'మెమొరీ లాస్'ని మెదడునిండా కుక్కుకుని
ముందుతరాల నరాలకూ ఎక్కించి
తన గొయ్యి తానే తవ్వుకుంటున్నాడు.
నేటి మనిషి!



– ఎస్. కాశింబి
సెల్: 9052216044

# ఓ.. పూసలమ్మా

తొలి పొద్దు మంచుల్లో
పాదాలకు రెక్కలు తగిలించుకొని
అనునిత్యం రేయింబవళ్లుగా
బరువుమోత నెత్తిన పెట్టి
చంకలో బిడ్డను చుట్టిపట్టి
ఊరూరా నడక సాగిస్తూ
గొంతులోంచి కూతపెడుతూ
గాజులమ్మా.. గాజులనీ..
పల్లె పల్లెను పలకరిస్తున్న
ఓ పూసలమ్మా నీకు వందనాలమ్మా !

గాజులను తొడుగుతు
నుదిటి తిలకమును దిద్దుతూ
కాళ్ళకు దిష్టిపూసలు తొడుగుతూ
ముంగురులకు దువ్వెనను దోస్తి చేస్తూ
ముత్తైదువును రాతగా అద్ది
ఆమెకు ఆమెగా అద్దమై చూపుతూ
నిండు సౌభాగ్యాన్ని తెచ్చే
పదహారణాల స్త్రీరూపం నీదమ్మా !

శుభ కార్యాలకు నువ్వే ఉదయమై
కుటుంబ స్త్రీలకు అందం తెచ్చి
ఆనందాలకు తోరణమై నిలిచే
నుదుటి సింధూర తేజోవంతపు
బంగారు వన్నెలద్దిన మనసు నీవమ్మా !

ముళ్లదారిలో మూటలు మోసి
నమ్ముకున్న వృత్తిని
వమ్ముకాని నమ్మకాన్ని వదలకుండా
దేహాల చెమటల మట్టితో
వన్నె తెచ్చిన తేజోరూపం
నీవమ్మా బంగారు పూసలమ్మా!

కన్నీటి గాథలను దిగమింగి
పన్నీటి బాధలను మదిలోదాచి
బతుకు ఆశయాలతో అహర్నిశలు
జీవనం సాగించి
శ్రమైక జీవ సౌందర్యాన్ని
మోసే రివాజు నీవమ్మా
సంచారం చేసే ఓ పూసలమ్మా !

నిన్నటి నీరెండల కన్నులవనంలో
నేటి ఆశల బతుకు బృందావనమున
భవిష్యత్ ఆశయాల విత్తురేఖలు ఎదిగి
పూలదారులై సాగే
ఓ మనసున్న హృదయం నీవమ్మా
ఓ పూసలమ్మా



–డాక్టర్ పగిడిపల్లి సురేందరు
8074846063

# రగిలే హృదయం

లావాలా ఎగసిపడే అగ్నికణం నా గుండె శబ్దం,
ప్రతి రక్తపు బొట్టులో ఎర్రని వర్ణపు వేడి సెగ,

మండే అగ్నిగోళమై దేహంలో రగిలే నిప్పుకణికలు,
ఎరుపు వర్ణంతో వేడెక్కిన హృదయగోడలు,
లోపలి దేహపు కుంభస్థలాన్ని బద్దలు కొట్టే
వేడి నిట్టూర్పుల మోత,
కోపాన్ని ఒక మాదిరిగా మోసే బరువులాట,

రౌద్ర కళ్ళల్లో దాచిన అశ్రువు నిప్పుతునకై మారే క్షణం,
భగభగ మండే భానుడికి మల్లే రగిలే వేడికి తార్కాణం,
మండే గుండెకి దాహార్తి కరువు,
అది మిగిల్చే మనోవేదన,
కరడు గట్టిన లోకంలో ఒంటరిలా మిగిలిన
మండే గుండెను ఓదార్చే చేతులకై నిరీక్షణ.....



–దడిగె నరేష్
మస్కట్ ( ఒమన్ )
00968 93029220

# మట్టి నానీలు

అన్నదాతకు
ఆహారం పెట్టింది కుండ
మట్టి రేణువులలో
మమతలు నింపి.

పుట్టమన్ను తెచ్చి
మట్టిపొయ్యేసింది అమ్మ
ఇక చేసుకోండి
సకినాల రుచి.

కొంచం కుండ
ఆనాటి కొలమానం
రైతు చెమటకు
ప్రమాణం.



–నాంపల్లి సుజాత
9848059893

# మాంగల్య బంధం

మౌనాలు రాజ్యమేలుతుంటే
మాటల సవ్వడులకు తావెక్కడ
ముగింపు లేని మాటల యుద్ధానికి
ముందుగా తగ్గేది ఎవరు ?

ముచ్చటగా మూడు మాటలతో
మనసులు కలిసిపోయాయని
మిడిమిడి జ్ఞానంతో.....
మూడుముళ్ల బంధంతో ఒక్కటై
ముచ్చటైన కాపురానికి శ్రీకారం
చుట్టిన జంటలు....

మురిపం తీరిన మూన్నాళ్ళకే
మాట మాట పట్టింపులతో
తెగ తెంపులు....
మాయదారి ఇగోల చెదలు
మనసులను పట్టి పీడిస్తుంటే
ప్రేమలకు చోటేది...?

మాధుర్యాల నడుమ
మమతల పొదరిల్లు లా
మల్లె తీగలా అల్లుకుపోయే
సంసారానికి బీటలు పడేలా
మరోవైపు అనుమానాలు
పెను భూతాలై కలవర పెడుతుంటే
మది వీణియ పై సరస సరాగాలు
పాడేది ఎన్నడు ....?

మారాలి నేటి జంటలు
మనువాడిన మరుక్షణం నుండే
మనము మనది అనుకుంటూ
మనసు మనసు తెలుసుకుంటూ ....
ఇగోలను
మచ్చుకైనా దరిచేరనీయక
జంట పయనాన్ని సాగించినపుడే
మాంగల్య బంధానికి
అర్థం పరమార్థం.



–కళావతి కందగట్ల
9948263004

